# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో నూతన ఆర్థిక వ్యవస్థకు శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ ఖరీఫ్ సీజన్‌లో పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందజేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.
- ❖ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.
- ❖ పత్తి రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలియజేశారు.

========================

రాష్ట్రంలో నూతన ఆర్థిక వ్యవస్థకు శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు ముఖ్యమంత్రి శాసనసభలో బడ్జెట్‌పై మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో అనేక సమస్యలు ఎదుర్కొన్నామని, 2014 సంవత్సరం నాటికి రాష్ట్రంలో విద్యుత్ లోటు ఉండేదని చెప్పారు. విద్యుత్ రంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి మిగులు విద్యుత్ స్థితికి తీసుకువచ్చామన్నారు. అమరావతి రైతులు ఎంతో నమ్మకంతో భూములు ఇచ్చారన్న ముఖ్యమంత్రి, విభజన సమయంలో కంటే గత 5 సంవత్సరాల్లోనే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగిందన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు.

(వాయిస్ 25 సెకన్లు)

========================

ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో పంట నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం పరిహారం అందజేస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కరువు పీడిత మండలాలకు సంబంధించి శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ప్రభుత్వం గత నెల 29వ తేదీన 5 జిల్లాల్లోని 54 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిందని, ఇప్పటి వరకు 1.06 లక్షల హెక్టార్లలో 1.44 లక్షల మంది రైతులు పంట నష్టపోయారని వెల్లడయ్యిందని చెప్పారు. దీనికోసం 159.20 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశామని, త్వరలోనే రైతుల ఖాతాలో నగదు జమ చేస్తామని తెలిపారు. నష్టపోయిన వారందరికీ సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో వరదల్లో నష్టపోయిన రైతులకు 20 రోజుల్లోనే నష్టపరిహారాన్ని అందజేసినట్టు చెప్పారు. 80 శాతం కౌలు రైతులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చిందని మంత్రి మండలిలో తెలియజేశారు.

========================

వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశలలో భాగంగా శాసనసభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానిమిస్తూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి డిఎస్సీ ఫైలు పైనే తొలి సంతకం చేశారని చెప్పారు. చట్టపరమైన ఆటంకాలు ఏవీ లేకుండా టీచర్ పోస్టుల భర్తీ చేయాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. 1994 నుంచి కేసుల వివరాలు తెప్పించామని, పకడ్బందీగా డిఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

డిఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితి సడలింపునకు సంబంధించిన ఫైలు ముఖ్యమంత్రి వద్ద ఉందని, ఫైలు వచ్చాక ఎంత సడలింపు ఇవ్వాలో నిర్ణయిస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

========================

విశాఖ జిల్లాలో చేపట్టనున్న అభివృద్ధి ప్రాజెక్టులు, భవిష్యత్తు కార్యాచరణపై జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఈరోజు సమీక్ష నిర్వహించారు. జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్ కుమార్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్. భవానీ శంకర్, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులతో కలిసి వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే... ఇటీవల ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలో భాగంగా ప్రస్తావించిన అంశాలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా పర్యాటకానికి, పచ్చదనానికి పెద్దపీట వేస్తూ.. జిల్లాలో కార్యాచరణ రూపొందించాలని, ఇక్కడి వాతావరణ పరిస్థితులకు సరిపడే మొక్కలను పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పచ్చదనం పెంపొందించే విషయంలో అటవీ శాఖ, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, టూరిజం, పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

విరామం

========================

పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద ఏమైనా సమస్యలు ఎదురైతే తెలియజేసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా వట్టి చెరుకూరు మండలం కర్నూతల గ్రామంలోని పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఈరోజు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... వాతావరణం తడిగా ఉండటం వల్ల పత్తిలో తేమశాతం పెరిగి, కొనుగోలు చేయని పరిస్థితి ఉందని, ఈ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.. రైతులు సమస్యలను తెలియజేసేందుకు టోల్ ఫ్రీ నెంబరుతో పాటు ఫిర్యాదుల పెట్టెను కూడా కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేశామని కేంద్ర సహాయ మంత్రి వివరిస్తూ.....

(వాయిస్ 30 సెకన్లు)

==========================

సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యి, ముస్సోరిలో శిక్షణ పొందుతున్న 10 మంది ప్రొబేషనరీ అధికారులు ఈరోజు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌తో సమావేశమయ్యారు. శిక్షణలో భాగంగా వీరు పశ్చిమ గోదావరి జిల్లాలో క్షేత్ర స్థాయిలో పర్యటించి, వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై అధ్యయనం చేశారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా తెలుసుకున్న అంశాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ... జిల్లాలో ప్రధానంగా వ్యవసాయం, ఆక్వా కల్చర్ జరుగుతాయన్నారు. జిల్లాలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను వివరించారు.

==========================

శబరిమల యాత్రికుల రద్దీ దృష్ట్యా నవంబర్, డిసెంబర్ నెలల్లో దక్షిణ మధ్య రైల్వే 8 ప్రత్యేక రైళ్లను నడపనుంది. ఈ నెల 22, 29వ తేదీల్లో మౌలాలి నుండి కొల్లాం వరకూ ఒక ప్రత్యేక రైలు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు ఈ నెల 22, డిశంబర్ 1 తేదీల్లో కొల్లాం నుండి మౌలాలికి నడుస్తుంది. అలాగే... ఈ నెల 18, 25 తేదీల్లో ఒక ప్రత్యేక రైలు మచిలీపట్నం నుండి కొల్లాం వరకూ, తిరుగు ప్రయాణంలో ఈ నెల 20, 27 తేదీల్లో కొల్లాం నుండి మచిలీపట్నంకు నడుస్తుందని రైల్వే వర్గాలు తెలియజేశాయి. ఈ ప్రత్యేక రైళ్ళు మార్గంలోని అన్ని ముఖ్య స్టేషన్లలో ఆగుతాయని, ఫస్ట్, సెకెండ్, థర్డ్ ఏసి, స్లీపర్ క్లాసులతో పాటు జనరల్ కోచ్‌లు కలిగి ఉంటాయని పేర్కొంది.

==========================

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ చైర్మన్ గా జీవీ రెడ్డి ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ కనెక్షన్లను రానున్న 2 సంవత్సరాల్లో 50 లక్షలకు పెంచుతామన్నారు. ఇప్పటి వరకు 6 లక్షల కేబుల్ కనెక్షన్లు మాత్రమే ఉన్నాయన్నారు. వీలైనంత వరకు నాణ్యమైన సర్వీసులు అందించి, ప్రజల ఆదరణ పొందుతామన్నారు. ప్రైవేట్ కంపెనీ సర్వీస్ ప్రొవైడర్లకు పోటీగా ప్రజలకు సర్వీస్ లు అందిస్తామన్నారు. ఫైబర్ నెట్ ను ప్రజలకు చేరువ చేయడంలో తమ వంతు కృషి చేస్తామన్నారు. ఇంటర్ నెట్, ఫోన్, కేబుల్ పూర్తి క్వాలిటీతో అందిస్తామన్నారు.

==========================

నిడదవోలు నియోజకవర్గంలో రోడ్లు భవనాల శాఖ పరిధిలో పనులకు 2.61 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. అత్యవసర మరమ్మత్తుల కోసం సంబంధిత నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా టెండర్లు త్వరితగతిన పూర్తి చేయడానికి నిడదవోలు ప్రాంతంలోని రోడ్లు భవనాల శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సూచించారని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే పనులు మొదలు పెట్టనున్నట్లు మంత్రి తెలిపారు.

==========================

==========================